నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, ఆదివారం 23 మార్చి 2025 | KHAMMAM




చంద్రుకుంట గ్రామంలో సింగరేణి అధికారులు వేసిన సోలార్ బోరు సిస్టమ్

# బిందె నిండాలంటే..
# అరగంట ఆగాల్సిందే..

- చంద్రుకుంట గ్రామంలో తీవ్రంగా తాగునీటి ఎద్దడి
- 18 కుటుంబాలకూ సక్రమంగా అందని తాగునీరు
- స్నానం చేసేందుకూ వెనుకాడుతున్న దైన్యంలో వృద్ధులు
- 'మిషన్ భగీరథ' లీకులపై దృష్టి పెట్టని కాంగ్రెస్ పాలకులు
- సరిపడా నీళ్లివ్వలేకపోతున్న సింగరేణి సోలార్ బోరు పైపులు
- చంద్రుకుంట, పాతూరుల్లో వేసవి ప్రారంభంలోనే నీటి కటకట

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : అది జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న గ్రామం. 18 కుటుంబాలు 55 మంది జనాభా ఉన్న ఓ చిన్న గ్రామం. అదే.. చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీలోని చంద్రుకుంట. ఇంత చిన్న గ్రామాన్ని తాగునీటి సమస్య మాత్రం వెంటాడుతోంది. మరోవైపు గత కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన మిషన్ భగీరథ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం కూడా ఈ గ్రామ ప్రజలకు శాపంగా మారింది. భగీరథ పైపులకు లీకులు ఉన్నా కనీసం మరమ్మతులు చేసిన పాపానపోలేదు. దీంతో గ్రామానికి పెద్దగా నీరు రావడం లేదు. ఆ నీళ్లతో ఒక్కో బిందె నిండేందుకు అరగంట పడుతోందంటే అతిశయోక్తి కాదు. మరోవైపు ఇదే గ్రామానికి నీళ్లు అందించేందుకు సింగరేణి ఏర్పాటు చేసిన సోలార్ బోరు పైపులైన్ పరిస్థితి కూడా అలాగే ఉంది. కనీసం దాని నుంచి నీళ్లు కూడా సరఫరా కావడం లేదు. నీటి సమస్య కారణంగా వృద్ధులు స్నానం చేసేందుకు కూడా వెనుకాడుతున్నారంటే ఆ గ్రామంలో నీటి సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వేసవి ప్రారంభంలోనే భద్రాద్రి జిల్లాను తాగునీటి సమస్య పట్టి పీడిస్తోంది. తాగునీటి సమస్యను సమూలంగా నిర్మూలించాలని, ఇంటింటికీ శుద్ధ జలాలు అందించాలని గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఎంతో మంచి ఫలితాలనిచ్చాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ శుద్ధ జలాలు అందాయి. కానీ.. ఏడాదిన్నర క్రితం వచ్చిన కాంగ్రెస్ సర్కారు మిషన్ భగీరథ పథకాన్ని నీరుగారుస్తోంది. కనీసం మరమ్మతులపై కూడా దృష్టిసారించడం లేదు. దీంతో ఆవాస గ్రామాలకు తాగునీరు అందని ద్రాక్షగానే మిగులుతోంది. భద్రాద్రి జిల్లాలో 481 గ్రామ పంచాయతీలుండగా.. వాటిల్లో ప్రసుత్తం 21 గ్రామ పంచాయతీల్లో తీవ్రమైన తాగునీటి సమస్య కన్పిస్తోంది. జిల్లాలోని సుమారు 700 చేతిపంపుల్లో నీళ్లు రావడం లేదు. ఫలితంగా వాటిపై ఆధారపడిన ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ఓవైపు భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు నీళ్లు అందించేందుకు ప్రస్తుత ప్రభుత్వం కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు. కొత్త బోర్లు వేయడం లేదు. పైగా, మరమ్మతులపై కూడా పెద్దగా దృష్టిపెట్టడం లేదు.

## ఆవాస ప్రాంతాలకు అందని ద్రాక్షగా..

మండల కేంద్రాల్లో తాగునీటి ఎద్దడి ఇలా ఉంటే.. ఆవాస ప్రాంతాల్లో అయితే తాగునీళ్లు అందని ద్రాక్షగానే మారాయి. మరమ్మతులకు గురైన చేతిపంపులు అలంకారప్రాయంగా కన్పిస్తుండడం సమస్యకు అద్దంపడుతోంది. లక్ష్మీదేవిపల్లి మండలం పాతూరు గ్రామంలో నీటి సమస్య అక్కడి ప్రజలను ఇబ్బంది పెడుతోంది. గుండాల మండలం బాటన్ననగర్, ఆళ్లపల్లి మండలం అడవిరామవరం, టేకులపల్లి మండలం మంగల్‌తండా, సుజాతనగర్ మండల కేంద్రలోని బాలాజీ నగర్‌తోపాటు ములకలపల్లి మండలంలోని మరో రెండు గ్రామాల్లో వేసిన నల్లాలకు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు కనీసం నీటిని కూడా సరఫరా చేయడం లేదు. దుమ్ముగూడెం మండలం ఎర్రబోరులో గ్రామస్తులకు ట్యాంకు నుంచి నీళ్లు అందని పరిస్థితి ఏర్పడింది. అయితే వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఇంత తీవ్రంగా ఉంటే.. మండు వేసవిలో ఎలా ఉంటుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గంట వేచిచూస్తేగానీ బిందెనిండా నీరు రాని చంద్రుకుంట గ్రామం



లక్ష్మీదేవిపల్లి : నీళ్లు రాని బోరు వద్ద గ్రామస్తులు

### 63 కుటుంబాలు.. రెండు పంపులు..

లక్ష్మీదేవిపల్లి, మార్చి 22 : లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం పంచాయతీ పాతూరులో తాగునీటి ఎద్దడి తీవ్రంగానే ఉంది. ఈ గ్రామంలో 63 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీటి కోసం ఒక విద్యుత్ బోరు, ఒక చేతి పంపు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. కరెంటు ఉన్నప్పుడే బోరు నుంచి ఉదయం ఒక గంట సేపు నీళ్లు ఇస్తారు. సాయంత్రం మరో అరగంట ఇస్తారు. ఇంతకొద్ది సమయంలో ఇచ్చే నీళ్లు గ్రామస్తులకు సరిపోవడం లేదు. ఒకవేళ కరెంటు లేకపోతే ఆ నీళ్లు కూడా రానట్టే. ప్రత్యామ్నాయంగా ఉన్న చేతిపంపు నుంచి కూడా నీళ్లు రావడం లేదు.



నీరు రాని చేతిపంపు

### గంటల కొద్దీ పంపు దగ్గరే ఉండాల్సి వస్తోంది..



మా ఊరు చిన్నదే అయినా తాగు నీటి సమస్య పెద్దగా ఉంది. పైపులు లీకవుతున్న కారణంగా నల్లాల్లోకి నీళ్లు సరిగా సరఫరా కావడం లేదు. ట్యాంకులో నీరు ఉన్నా ఇళ్లకు సప్లయి అయ్యే పరిస్థితి లేదు. తాగునీటికి చాలా ఇబ్బందిగా ఉంది. బడి దగ్గర ఉన్న చేతి పంపు వద్దకు వెళ్తున్నాం. ఊర్లో ఉన్న ఇంకో చేతి పంపు మరమ్మతులకు గురైంది.

**–రజితకుమారి, చంద్రుకుంట, చుంచుపల్లి**

### ఒక బోరుతో వచ్చే నీళ్లు సరిపోవడం లేదు..



మా గ్రామంలో ఒకే ఒక్క విద్యుత్ బోరు ఉంది. దాని ద్వారా మా గ్రామంలో తాగునీటి సమస్య తీరడం లేదు. గంట వదిలినా ఆ నీళ్లు అందరికీ సరిపడా రావడం లేదు. కనీసం గ్రామంలోని చేతిపంపులకైనా ప్రభుత్వం మరమ్మతులు చేయించాలి. ట్యాంకు నిర్మించాలి. అప్పుడే నీళ్లు సరిపోతాయి.

**–చీమల సతీశ్, పాతూరు, లక్ష్మీదేవిపల్లి**

### సోలార్ వేశారుగానీ నీళ్లు రావడం లేదు..



మా గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం సింగరేణి అధికారులు గతంలో సోలార్ బోర్ వేశారు. కానీ.. ఇప్పుడు అక్కడి నుంచి కూడా నీళ్లు రావడం లేదు. గ్రామంలో ఉన్నది ఒకటే నల్లా. ఇంకో నల్లా పనిచేయడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు తక్కువగా వస్తున్నాయని సోలార్ బోరు వద్దకు వెళ్తున్నాం. అక్కడ కూడా చిన్న ధారే వస్తోంది. పనులకు వెళ్లకుండా పంపు దగ్గరే ఉండాల్సి వస్తోంది.

**–వెంకటేశ్వర్లు, చంద్రుకుంట, చుంచుపల్లి**



మణుగూరులో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తే చూస్తూ ఊరుకోం..
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- మణుగూరులో ప్ల కార్డులతో బీఆర్ఎస్ భారీ ప్రదర్శన, నిరసన



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న రేగా

మణుగూరు టౌన్, మార్చి 22 : గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి లారీలు, ట్రాక్టర్లకొద్దీ ఇసుక అక్రమంగా తరలిపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అక్రమ రవాణాను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు మణుగూరు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. తొలుత బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి రేగా ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ ప్రధాన సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన మహిళలు ఇసుక అక్రమ రవాణా, తమకు కలిగే ఇబ్బందుల గురించి రేగాకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినపాక, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, పాల్వంచ, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, మంగపేట, మణుగూరు మండలాల్లో గోదావరి, కిన్నెరసాని, పెదవాగు నదులపై పెద్ద ఎత్తున ఇసుక తోలకాలు జరుగుతున్నా ఏ అధికారీ పట్టించుకోవడం లేదన్నారు. దీనికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అక్రమార్జనే ధ్యేయం 12 లారీలను బినామీ పేర్లతో నడిపిస్తూ ఇసుక రవాణా జోరుగా సాగిస్తున్నారని ఆరోపించారు. స్థానికులు తమ అవసరాల కోసం ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తే అధికారులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అర్ధరాత్రి పొక్లెయిన్లతో కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లో తోలే ఇసుక రవాణా అధికారులకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కొల్లగొట్టి.. కాంగ్రెస్ నాయకులకు దోచిపెట్టే పనిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోషం నర్సింహారావు, అడపా అప్పారావు, కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, వట్టం రాంబాబు, మధు, రవి, కోటి, నూకారపు రమేశ్, నర్సింహారావు, రంజిత్, యాదగిరిగౌడ్, రాహుల్, సృజన్, రమాదేవి, జ్యోతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎండుతున్న పంటలు

## రెండు కిలోమీటర్ల పైపులు వేసి పంటలను కాపాడుకుంటున్న రైతులు

## ఎండిపోయిన పంటలకు పరిహారం అందించాలి : జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు



రైతులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, మార్చి 22 : ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతుల పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని, సాగు భూములు నెర్రెలు వారుతున్నాయని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తొండల గోపవరం రెవెన్యూ పరిధిలోని సాయిపురం గ్రామంలో సాగునీరందక నెర్రెలు వారిన పొలాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. కట్టలేరు పరిధిలో సుమారు 70 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు రైతులు ఆయనకు తెలిపారు. వరి పంట గింజపట్టే దశలో సాగునీరు అందకపోవడంతో గ్రామంలోని బోరుకు రెండు కిలోమీటర్ల మేర పైపులైన్ వేసుకుని పంటలను కాపాడుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం కమల్‌రాజు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు కట్టలేరుపై ఆధారపడి వరి సాగు చేస్తున్నారని, కానీ.. అందులో నీరు లేకపోవడంతో పంటలకు నీరందడం లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కట్టలేరుకు సాగర్ జలాలను లంకాసాగర్ ద్వారా విడుదల చేయడం వల్ల సాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలగలేదన్నారు. కట్టలేరుపై చెక్‌డ్యాం నిర్మించడం వల్ల రెండు కిలోమీటర్ల మేర నీటి నిల్వ ఉండేదన్నారు. ఆ నీటితోనే రైతులు పంటలు పండించుకునేవారని తెలిపారు. ఇప్పటి అధికారుల నిర్లక్ష్యం వల్ల సాగర్ నీటిని సరఫరా చేయకపోవడంతో కట్టలేరు ఎండిపోయిందన్నారు. తన నియోజకవర్గంలో పంటలు ఎండిపోతున్నా డిప్యూటీ సీఎం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ కటికల సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు బొగ్గుల వీరారెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, తుమ్మ వీరారెడ్డి, చంద్రారెడ్డి, పింగళి సూర్యప్రకాశ్, రామిరెడ్డి, నరెడ్ల బాలకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు యన్నంశెట్టి అప్పారావు, సయ్యద్ ఇక్బాల్, పల్లిపాటి కోటేశ్వరరావు, వీరంశెట్టి సీతారామయ్య పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు

## భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ రూరల్, మార్చి 22 : వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇం కుడు గుంతలు విరివిగా నిర్మించుకోవాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జగన్నాథపురం రైతు వేదికలో భూగర్భ జలాల వినియోగం, నిర్వహణ, పెంపుదల, రీచార్జి పద్ధతులపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటిని వృథాపోనీయకుండా నిల్వ చేసి వివిధ పద్ధతుల ద్వారా మొక్కలు, పంటలకు అందించి పచ్చదనాన్ని పెంచవచ్చన్నారు. ప్రతీ రైతు తమ పొలాల్లో ఫాంపాండ్ , ప్రతీ గ్రామస్తుడు తన ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. వీటి వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. తాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలకు నీటి అవసరం ఎంతో ఉందన్నారు. అలాగే రైతులు మునగ సాగుపై ఆసక్తి పెంచుకోవాలని, సాగులో మెళకువలు నేర్చుకుని విస్తారంగా పంట పండించాలన్నారు. అదనపు కలెక్టర్ విద్యాచందన నీటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం జగన్నాథపురంలో ఇంకుడు గుంతను తవ్వారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, పంచాయతీ అధికారి చంద్రమౌళి, కొత్వాల శ్రీనివాసరావు, ఇతర అధికారులు తిరుమలేశ్, రమేశ్, వివేక్, విజయభాస్కర్‌రెడ్డి, రేవతి, చంగల్‌రావు, హరిప్రసాద్, రంగా, రాజ్‌కుమార్, తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

# 'సదరం'లో వసతులు కల్పించాలి

## వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం సిటీ, మార్చి 22 : వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే దివ్యాంగుల కోసం సదరం క్యాంప్ నిర్వహణ సమయంలో అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. సదరం క్యాంప్‌ల నిర్వహణ కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేపట్టాల్సిన ఏర్పాట్లను శనివారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, శిక్షణా కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు అందించే యూడీఐడీ కార్డులు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉపయోగపడతాయని అన్నారు. కొత్తగా కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఆసుపత్రిలో నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. వికలాంగత్వం నిర్ధారణ కోసం వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు సమయంలో రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు, టాయ్‌లెట్స్, ర్యాంప్ వంటి వసతులు కల్పించాలని ఆదేశించారు. పరీక్షల తర్వాత ప్రతీ దివ్యాంగుడి వైకల్యం శాతంతోపాటు ఇతర వివరాలను సంపూర్ణంగా యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, జిల్లా సంక్షేమాధికారి కే.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

# మంగళ గూడెంలో ఎండిన పొలాల పరిశీలన

- రైతులతో ముఖాముఖి మాట్లాడిన అధికారుల బృందం
- 'నమస్తే' కథనానికి స్పందన



ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న డీఏవో, ఏడీఏ ఇతర అధికారులు

ఖమ్మం రూరల్, మార్చి 22 : మంగళగూడెం గ్రామానికి చెందిన రైతులు యాసంగిలో సాగు చేసిన వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి, అధికారుల బృందం శనివారం పరిశీలించింది. 'యాసంగి ఆశలు ఆవిరి' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి ఉమా నాగేష్, కూసుమంచి డివిజన్ వ్యవసాయాధికారి బి.సరిత, జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్యలు క్షేత్రస్థాయిలో పంట పొలాలను నిశితంగా పరిశీలించారు. పంట సాగు చేసిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఎవరెవరు ఎంత మొత్తం సాగు చేశారు? ప్రస్తుతం పంట పరిస్థితి ఏమిటి? నీటి లభ్యత ఎలా ఉంది? తదితర విషయాలపై ఆరా తీశారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని, ఊహించని విధంగా నీటి ఎద్దడి వచ్చిందని అధికారుల ఎదుట వాపోయారు. మరో వారం దాటితే పశువులకు తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందన్నారు. వెన్నారం చెరువు నీటిని కనీసం రెండు రోజులు వాగులోకి వదిలితే బయట పడుతామని అధికారులకు వివరించారు. అనంతరం సమీపంలోని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం చెరువును అధికారులు సందర్శించారు. నీటి నిల్వలను పరిశీలించారు. గ్రామంలోని వరి పొలాల పరిస్థితి గురించి డీఏవో అక్కడి నుంచి ఉన్నతాధికారులకు ఫోన్‌లో వివరించారు. మహబూబాబాద్ జిల్లా ఇరిగేషన్ అధికారులతో కూడా డీఏవో మాట్లాడారు. ఆయన వెంట ఏఈవోతోపాటు రైతులు ఉన్నారు.

# బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టు

ఖమ్మం/మామిళ్లగూడెం, మార్చి 22 : ఖమ్మం నగరంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులను స్థానిక పోలీసులు శనివారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రజా ఉద్యమాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించడంతో విద్యార్థి సంఘాల జేఏసీ 'చలో ఓయూ'కు పిలుపునిచ్చింది. ఈ మేరకు ఖమ్మంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా నాయకులు లింగనబోయిన సతీష్, కోడిరెక్క ఉమాశంకర్, బెల్లంకొండ గోపి, వాసంశెట్టి సాయి, ఫక్రులను ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఖమ్మంలో పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్వీ నాయకులు

# ఖాళీ బిందెలతో మహిళల నిరసన

## 'భగీరథ' నీరు అందించాలని కాలనీవాసుల డిమాండ్



ఆత్కూరులో రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మధిర, మార్చి 22 : తమకు మిషన్ భగీరథ నీరు అందించాలని కోరుతూ ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కి నిరసన తెలిపిన ఘటన ఆత్కూరు గ్రామంలోని కుంటబీడు కాలనీలో శనివారం చోటు చేసుకుంది. కూలీలు ఎక్కువగా నివసించే ప్రాంతం కావడంతో వారం రోజులుగా తాగునీరు రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని, తమ ప్రాంతానికి మిషన్ భగీరథ పైపులైన్ వేసి మంచినీళ్లు అందించాలని కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేయాలని, అవసరం ఉన్నచోట చేతిపంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు అంకె శివయ్య, గ్రామస్తులు పల్లెపోగు జానకమ్మ, పల్లెపోగు నాగయ్య, పలిమల వెంకటరత్నం, మీనుగు పద్మ, వెంకటకుమారి, మేరి, యేసుమణి, లక్ష్మి, కమలమ్మ, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.